జ్వాల దశ

నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM

సోమవారం
02-11-2026

సంపుటి 1 | సంచిక 340

పేజీలు : 04

వెల : 1/-

PRGI No : TGTEL/25/A4195

విలేకరులు కావలెను

నిత్య నూతన ఒరవడితో నిజాలను నిర్భయంగా అందిస్తూ, ప్రత్యేకంగా వార్తా కథనాలను ఎప్పటికప్పుడు ప్రచురిస్తున్న దశ పత్రికలో భాగమయ్యేందుకు తెలంగాణ రాష్ట్రంలోని ఆసక్తిగల అభ్యర్థులను ఆహ్వానిస్తున్నాము.

జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్ | ఆర్.సీ.ఇన్చార్జులు
మండల రిపోర్టర్స్ | క్రైమ్ రిపోర్టర్లు

7337546647
(మీ వివరాలను వాట్సప్‌లో పంపగలరు)



మోదీ రావణుడు..

మేం వానర సైన్యం!

పేదలను లక్ష్యంగా చేసుకొనే ఓట్ చోరీ.. ఇప్పటికే 13.5 కోట్ల ఓట్లు తొలగించారు

మరో 7 కోట్ల ఓట్లు తీసేసి దొడ్డిదారిన అధికారంలోకి రావాలని కుట్ర: రేవంత్

జ్ఞానేశ్‌ను ఇంటికి పంపేసి ప్రజలకు మోదీ క్షమాపణ చెప్పాలి: మహేశ్ గౌడ్

ఓటర్ల జాబితాలో అక్రమాలపై ఐదారేళ్లుగా రాహుల్ హెచ్చరిస్తున్నారు: భట్టి విక్రమార్క

న్యూఢిల్లీ: మోదీ రావణుడు అని, ఆయన్ను గద్దె దించి.. గుజరాత్‌కు పంపేదాకా విశ్రమించేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మోదీని ఓడించేందుకు తెలంగాణ నుంచి కాంగ్రెస్ కార్యకర్తల రూపంలో వానరసైన్యం ఢిల్లీకి వచ్చిందన్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలోని ఇండీ కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు ముందు తెలంగాణ భవన్‌లో పార్టీ శ్రేణులను ఉద్దేశించి రేవంత్ మాట్లాడారు. మోదీ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు పేద ప్రజలను లక్ష్యంగా చేసుకొని వారి ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. సీఈసీగా జ్ఞానేశ్ కుమార్‌ను నియమించి ఇప్పటికే దేశంలో 13.5 కోట్ల ఓట్లు తొలగించారని.. రానున్న రోజుల్లో మరో 7కోట్ల ఓట్లు తొలగించి.. దొడ్డిదారిన అధికారంలోకి రావాలని బీజేపీ కుట్ర పన్నుతోందని రేవంత్ ఆరోపించారు. ఓట్ చోరీ ద్వారా మహారాష్ట్ర, బిహార్, బెంగాల్‌లో ఇప్పటికే బీజేపీ లాభపడిందని విమర్శించారు. తెలంగాణ బలాన్ని, గళాన్ని ఢిల్లీలో గట్టిగా వినిపించేందుకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో 15వేల మంది కార్యకర్తలను ప్రత్యేక రైళ్లలో తరలించేందుకు ఏర్పాట్లు చేశామని.. కేంద్రం కుట్రపూరితంగా

..మిగతా 4వ పేజీలో ➔

రాష్ట్రంలో కరువుకు బాధ్యత

ముఖ్యమంత్రిదే

రైతుల రక్తమాంసాలు పీలుస్తున్న కాంగ్రెస్.. దివానాగాళ్లకు ఓటేస్తే రాష్ట్రం దివాలా






'రైతుబంధు' బంద్.. రాహుల్ ఖాతా కంటిన్యూ

బడే మియా, చోటే మియా కలిసి దోపిడీ


బాబుకు రేవంత్ గులాం

ఆదిలాబాద్: రాష్ట్రాన్ని రాబందుల ప్రభుత్వం ఏలుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమె త్తారు. రైతుల రక్తమాంసాలను పీల్చుకుతింటూ వారి జీవితాలపై కాంగ్రెస్ సర్కా రు మరణశాసనం రాస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతుబంధు బంద్.. బోనస్ బంద్.. నీళ్లు బంద్.. కరెంటు బంద్.. కార్ఖానాలు, కంపెనీలు బంద్ అయ్యాయని, చివరకు వ్యవ సాయమే బంద్ చేసే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దివానాగాళ్లకు ఓటేస్తే రాష్ట్రం దివాలా పరిస్థితికి చేరిందని, మోసపోయి ఓటేస్తే గోసపడతారని గతంలో కేసీఆర్ చెప్పిన మాటలు నేడు నిజమవుతున్నాయని పేర్కొన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని డైట్ మైదా నంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అధ్యక్షతన నిర్వహించిన రైతు గర్జన సభలో కేటీఆర్ ప్రసంగించారు. 'రైతుబంధు బంద్.. రాజకీయాలు చూడండి రాహుల్ ఖాతా మాత్రం కొనసాగుతు న్నది. బడే మియా..చోటే మియా కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు' అని ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిన మూడు విడతల రైతుబంధుతో పాటు ప్రస్తుత యాసంగి పెట్టుబడి సాయాన్ని కలిపి ఎకరానికి రూ.60 వేల చొప్పున ప్రతి రైతు ఖాతాలో వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతులతో పాటు రైతు కూలీలకు ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. 'ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు' అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ కంటే రెండింతల వర్షపాతం లోటు ఉన్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ఇలాంటి కరువు పరిస్థితులు లేవని, అన్ని వనరులు, సాగునీటి అవకాశాలు అందుబాటులో ఉన్న తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం కారణంగా రైతులు

..మిగతా 4వ పేజీలో ➔



సింగిల్స్ చాంప్స్ సింధు, లక్ష్య సేన్



సార్‌బ్రుకెన్ (జర్మనీ): హైలో ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్- 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ 'డబుల్ ధమాకా' సృష్టించింది. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు... పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ విజేతలుగా నిలిచారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో ప్రపంచ 8వ ర్యాంకర్ సింధు 21-12, 21-14తో ప్రపంచ 25వ ర్యాంకర్ లినె హోమార్క్ జార్స్‌ఫెల్ట్ (డెన్మార్క్)పై, ప్రపంచ 14వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21-17, 21-10తో ప్రపంచ 6వ ర్యాంకర్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)పై నెగ్గారు. సింధు, లక్ష్య సేన్‌లకు 37,500 డాలర్ల (రూ. 35 లక్షల 59 వేలు) చొప్పున ప్రైజ్‌మనీ, 9200 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ ఏడాది సింధుకిది రెండో టైటిల్. గత జూలైలో సింధు జపాన్ ఓపెన్-750 టోర్నీలో విజేతగా నిలిచింది. మరోవైపు లక్ష్య సేన్‌కిది ఈ సీజన్‌లో తొలి టైటిల్. హైలో ఓపెన్‌లో లక్ష్య సేన్ చాంపియన్‌గా నిలువడం ఇది రెండోసారి. 2019లోనూ లక్ష్య సేన్ ఈ టోర్నీలో టైటిల్ సాధించాడు. 2024తర్వాత ఒకే టోర్నీలో పురుషుల, మహిళల సింగిల్స్ టైటిల్స్‌ను భారత ప్లేయర్లు నెగ్గడం ఇదే తొలిసారి కావడం విశేషం.


అహింసా మార్గంలో పయనించాలి

నిస్వార్థ కోరికలను భగవంతుడు తీరుస్తాడు: మైసూరు దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి

మంథని, కాటారంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ధన్వాడ దత్తాత్రేయ స్వామి ఆలయంలో పూర్ణాహుతి యజ్ఞం

వేద పుత్రులకు నిలయం మంత్రపురి: మంత్రి శ్రీధర్‌బాబు



మంథని: భగవంతుడు సర్వాంతర్యామి అని, ఆయనకు అనేక రూపాలు, కోటానుకోట్ల పేర్లు ఉన్నాయని, ఏ రూపంలో స్మరిం చినా భక్తులకు అనుగ్రహించి వారి కోరికలు తీరుస్తారని అవధూత మైసూర్ దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. అయితే భక్తులు కోరుకునే కోరికలు నిస్వార్థమైనవి, సహేతుకమైనవిగా ఉం డాలని హితపు పలికారు. భక్తి మార్గంలో నడుస్తూ ధర్మాన్ని ఆచరిస్తే జీవితంలో విజ యం సాధించవచ్చని, మానవసేవే మాధవసేవగా భావించి అహింసా మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. ఆదివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆహ్వానం మేరకు భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడతో పాటు పెద్దపల్లి జిల్లా మంథనిలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో స్వామీజీ పాల్గొని భక్తులకు దివ్య ప్రవచనం చేశారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో ధన్వాడకు చేరు కున్న స్వామీజీకి మంత్రి శ్రీధర్‌బాబు హెలిప్యాడ్ పద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి నివాసానికి చేరుకున్న స్వామీజీ, ధన్వాడలోని దత్తాత్రేయ స్వామి ఆలయం లో లోకకల్యాణార్థం నిర్వహించిన మహాపూర్ణాహుతి యజ్ఞంలో

..మిగతా 4వ పేజీలో ➔

ఘట్ కేసర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణంపై నిర్లక్ష్యం

అధికారులు, కాంట్రాక్టర్‌లపై ఉవ్వెత్తున ప్రజాగ్రహం!

18 ఏళ్లుగా కొనసాగుతున్న స్థానిక నాయకుల సుదీర్ఘ పోరాటం

వివిధ రూపాలలో నిరసనలు, నిరాహార దీక్షలు, ధర్నాలతో హోరెత్తుతున్న ప్రజలు

నేడు ఘట్ కేసర్ పట్టణ బంద్'కు అఖిలపక్షం పిలుపు

ఘట్ కేసర్: ఘట్ కేసర్ పట్టణ ప్రజల ఏళ్ల నాటి కల అ యిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఏళ్లుగా బ్రిడ్జి నిర్మాణం అ సంపూర్తిగానే దర్శనమిస్తుండటంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర అవేదన, ఆ గ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్వం, మౌనంపై స్థానిక అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాలు సమరశంఖం పూరించాయి. 18 ఏళ్లుగా స్థానిక ప్రజలు, నా యకులు సుదీర్ఘ పోరాటం చేస్తున్నా అధికారులు కాంట్రాక్టర్లకు




పట్టింపులేకుండా పో యింది. దీంతోఘట్ కేసర్ పరిసర ప్రాంత ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. అత్యవసర సమయంలో ఆస్పత్రులకు వెళ్లే అంబులెన్సులు, బడి పిల్లల బస్సులు సమయానికి చేరుకోలేకపోతున్నాయి. ఈసమస్య పరిష్కారం కోసం గత 18 ఏళ్లుగా మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజా సంఘాలు అనేక రకాలుగా పోరాటాలు చేస్తూనే ఉన్నారు. వినతిపత్రాలు ఇవ్వడం నుంచి మొదలుకొని ధర్నాలు, నిరాహార దీక్షలు, రాస్తారోకోలు చేసినా అధికారులు, కాంట్రాక్టర్ల ధోరణిలో ఏమాత్రం మార్పు రావడం లేదు. నిర్మించి వదిలేసిన పిల్లర్లు, నిలిచిపోయిన నిర్మాణ పనులు చూసి విసిగిపోయిన ప్రజలు ఇప్పుడు ప్రత్యక్ష పోరాటానికి దిగా రు. బ్రిడ్జి నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్లు, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నేడు 'ఘట్కేసర్ పట్టణ బంద్'

రైల్వే వంతెన నిర్మాణ పనుల జాప్యాన్ని, అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, రైల్వే బ్రిడ్జి నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేయాలనే ప్రధాన డిమాండ్లో సోమవారం ఘట్ కేసర్ పట్టణ బంద్ కు అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని

..మిగతా 4వ పేజీలో ➔



బ్యాగు తెరిస్తే.. రూ.60 లక్షల నకిలీ నోట్లు!

హైదరాబాద్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో భారీగా నకిలీ కరెన్సీ పట్టుబడటం కలకలం రేపింది. సాధారణ ప్రయాణికుడిలా రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ఓ యువకుడి బ్యాగులో కట్టలు కట్టలుగా నకిలీ నోట్లు బయటపడటంతో పోలీసులు సైతం అప్రమత్తమయ్యారు. జైపూర్ నుంచి హైదరాబాద్ మీదుగా ముంబైకి నకిలీ కరెన్సీని తరలించే ప్రయత్నం చేసిన యువకుడిని GRP, RPF పోలీసులు సంయుక్తంగా అదుపులోకి తీసుకున్నారు. అతడి

..మిగతా 4వ పేజీలో ➔

మోదీ రావణుడు.. మేం వానర సైన్యం!

మొదటి పేజీ తరువాయి

వ్యవహరించి, రైళ్లను రద్దు చేసిందని తీవ్రంగా ఆక్షేపించారు. ‘‘మీరు రైళ్లను ఆపగలిగారేమో కానీ, తెలంగాణ ప్రజల సంకల్పాన్ని ఆపలేకపోయారు. మా బలమైన గళం ముందు మోదీ, అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ తలవంచక తప్పదు’’ అని వ్యాఖ్యానించారు. ఉన్నత వర్గాలకే ఓటు హక్కు ఉండాలనేది బీజేపీ మతోన్మాద సిద్ధాంతం అని పేర్కొన్నారు. ప్రజలే పాలకులను ఎన్నుకునేందుకు అప్పట్లో 30కోట్ల జనాభాకు ఓటు హక్కును కల్పించారని వివరించారు. ఉన్నత వర్గాలకే ఓటు హక్కు ఉండాలని అప్పట్లో బీజేపీ మతోన్మాద శక్తులు వాదించాయని.. అయితే దళితులు, గిరిజనులు, బీసీలు, మైనారిటీలకు అంబేద్కర్ సమాన ఓటు హక్కు అందించారని తెలిపారు. మూడోసారి.. 400 సీట్లతో గనక అధికారంలోకొస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి, రిజర్వేషన్లు ఎత్తివేసి, పేదల ఓటు హక్కును తొలగించాలని మోదీ కుట్ర పన్నారని, ఆ విషయాన్ని గ్రహించిన ప్రజలు 240 సీట్లకే పరిమితం చేశారని చెప్పారు. బీజేపీ చేస్తున్న కుట్రలను ప్రతి ఒక్క కార్యకర్త పల్లెపల్లెకూ చేరవేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ సభకు దేశంలోనే అత్యధికంగా తెలంగాణ నుంచి భారీ ఎత్తున జన సమీకరణ చేసిన మహేశ్ గౌడ్‌ను రేవంత్ ప్రత్యేకంగా అభినందించారు. కాగా ఓట్ చోరీతో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోస్తూ ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాలు చరిత్రలో ఎన్నడూ చూడని అరాచకాలకు తెరలేపారని ఆరోపించారు. మోదీ, అమిత్ షాలు సీఈసీ జ్ఞానేశ్‌ను పదవి నుంచి ఇంటికి పంపాలని, దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన బాధ్యతగల ఎన్నికల సంఘం.. బీజేపీ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. సీఈసీ తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని స్వయంగా కమిషనర్లే పేర్కొనడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనమన్నారు. ఐదారేళ్లుగా ఓటర్ల జాబితా అక్రమాలపై రాహుల్ హెచ్చరిస్తున్నారని, ప్రతి నియోజకవర్గంలో 20 వేల నుంచి 25వేల ఓట్లు తొలగించి ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేశారని ఆరోపించారు. ఓట్ చోరీతోనే కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని మంత్రి వాకిటి శ్రీహరి విమర్శించారు. జాబితా నుంచి ఓట్లు తొలగిస్తున్న జ్ఞానేశ్‌కు శిక్షపడక తప్పదని మంత్రి వివేక్ అన్నారు. ఓట్ల చోరీకి పాల్పడిన వారిని కేంద్రం కాపాడుతోందని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఈసీ జ్ఞానేశ్‌ను వెనుకేసుకొచ్చే ప్రయత్నాన్ని మోదీ మానుకోవాలని సూచించారు.

రాష్ట్రంలో కరువుకు బాధ్యత

ముఖ్యమంత్రిదే



మొదటి పేజీ తరువాయి

కరువు కోరల్లో చిక్కుకున్నారని విమర్శించారు. ఎల్ నినో పేరు చెప్పి బాధ్యత నుంచి తప్పించుకునే పరిస్థితి లేదని, రాష్ట్రంలో నెలకొన్న కరువుకు ముఖ్యమంత్రే బాధ్యత వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు ఎకరానికి ఏడాదికి రూ.10 వేల చొప్పున రైతుబంధు అందిస్తే, తాము అధికారంలోకి వస్తే రూ.15 వేలు ఇస్తానని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని కేటీఆర్ గుర్తు చేశారు. హామీ నెరవేర్చకుండా రైతులను మోసం చేసిన దుర్మార్గుడు ఎవరో ప్రజలు ఆలోచించాలన్నారు. అంతేకాకుండా రైతు డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు ఇచ్చిందని, 2022 మే 6న వరంగల్ సభలో రాహుల్‌గాంధీ రైతులకు ఇచ్చిన హామీలను గుర్తుచేశారు. రూ.2 లక్షల రుణమాఫీ ఏమైంది? రైతుబంధు ఏమైంది? తులం బంగారం ఏమైంది? ఫీజు రీయింబర్స్‌మెంట్ ఏమైంది? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు దాటినా ఒక్క హామీనికూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందన్నారు. 21 లక్షల మంది రైతులకు రైతుబంధు అమలు చేయాలని, కౌలు రైతులకు ఆర్థిక సహాయం చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. 36 వేల మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. నేడు రైతులు వ్యవసాయం చేసుకునే పరిస్థితి కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు వేయడానికి రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుంటున్నారని, దుక్కి దున్నొద్దు.. భూములను పడావు పెట్టుకోవాలని చెప్పే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. రైతులకు ఇవ్వడానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం.. ఢిల్లీకి మాత్రం క్రమం తప్పకుండా డబ్బుల మూటలు పంపుతుందని విమర్శించారు.

రాష్ట్రాన్ని నడుపుతున్నది నల్లమల పిల్లి..

రాష్ట్రాన్ని నడుపుతున్నది నల్లమల పిల్లి అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అన్ని రంగాలకు హాలిడే ప్రకటించినట్లుగా పాలన సాగుతోందని విమర్శించారు. మంచిగా ఉన్న విద్యుత్ వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం ఆగం చేసిందని, పరిశ్రమలు మూతపడే పరిస్థితి తీసుకొచ్చిందని మండిపడ్డారు. రైతులకు సాగునీరు లేదు, పరిశ్రమలకు అవసరమైన విద్యుత్, ప్రోత్సాహం లేదు.. రాష్ట్రం అన్ని రంగాల్లో సంక్షోభం ఎదుర్కొంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికే హాలిడే ప్రకటిస్తే ప్రజల గోస తీరుతుందనే విధంగా రాష్ట్రంలో పరిస్థితి తయారైందన్నారు. కాంగ్రెస్ అంటేనే కరువు, కన్నీళ్లు, పలసలు అని, కరువు రాక్షసిని రేవంత్‌రెడ్డి మళ్లీ తెలంగాణకు తీసుకొచ్చారని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ పాలనలో రైతుల పరిస్థితి బ్రహ్మాండంగా ఉండేదని, రైతులు పుట్లకొద్దీ పట్లు పండించారని గుర్తు చేశారు. ఇప్పుడు మాత్రం రైతులు పంటలు వేయాలంటే భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 108 మంది రైతులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు.

లక్ష క్యూసెక్కుల నీళ్లు వృథా..

గోదావరి జలాలను వినియోగించుకోవడంలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. 750 టీఎంసీల నీళ్లు వచ్చినా ఒక్క చుక్క కూడా ఎత్తిపోయలేదని మండిపడ్డారు. ప్రస్తుతం కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి లక్ష క్యూసెక్కుల నీళ్లు కిందికి పోతున్నా వాటిని ఎత్తిపోయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాజకీయాలు చూడండి కన్నెపల్లి దగ్గర నీళ్లు ఎత్తిపోయవచ్చని రిటైర్డ్ ఇంజినీర్లు సూచించగా, వారికి బెల్ట్ ట్రీట్‌మెంట్ ఇవ్వాలన్నట్లుగా రేవంత్ మాట్లాడారని ఆరోపించారు. నీళ్లిస్తే యూరియా ఇవ్వాలి.. పంటలు పండితే కొనుగోలు చేయాలి.. రైతులకు బాధ్యతగా అండగా నిలవాలి. ఈ బాధ్యతల నుంచి తప్పించుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు అందించడంలో నిర్లక్ష్యం చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. ‘అచ్చ, పచ్చ కాంగ్రెస్ కాదు.. లుచ్చా కాంగ్రెస్’ అంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి చంద్రబాబుకు గులాంగా మారారని ఆరోపించారు. చంద్రబాబు కుప్పం వరకు నీళ్లు తీసుకెళ్తుంటే తెలంగాణలో మాత్రం సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు.

ఆ రెండు ప్రాజెక్టులు వినియోగిస్తే ఒక్క ఎకరం కూడా ఎండకపోయేది..

కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులను సక్రమంగా వినియోగించుకుని ఉంటే తెలంగాణలో ఒక్క ఎకరం కూడా ఎండిపోయే పరిస్థితి ఉండేది కాదని కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కరువుకు కల్పతరువు లాంటిదని, రాజకీయ కక్షతో వ్యవహరించకుండా రైతుల ప్రయోజనాల కోసం దానిని ఉపయోగించుకోవాలని సూచించారు.మ్యాప్‌లు చూడండి బీఆర్ఎస్ హయాంలో చనాకాకొరాటా ప్రాజెక్టు ట్రయల్ రన్ పూర్తయిందని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కాలువల నిర్మాణం చేపట్టడం లేదని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు నీళ్లు అందించడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. కేసీఆర్ అంటే కాలువలు, చెరువులు, రిజర్వాయర్లు.. కాంగ్రెస్ అంటే కరువు అని వ్యాఖ్యానించారు. కొమురం భీమ్ పుట్టిన గడ్డ, తెలంగాణ కశ్మీర్‌గా పేరొందిన ఆదిలాబాద్ జిల్లాలో కేసీఆర్ పాలనలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరగగా, కాంగ్రెస్ సర్కార్ ఆగం చేస్తుందని కేటీఆర్ మండిపడ్డారు. జిల్లాలో ఉన్న పరిశ్రమలను కాపాడడంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు విఫలమయ్యారని విమర్శించారు. ఆదిలాబాద్ సీసీఐ ఫ్యాక్టరీని నిర్వీర్యం చేసి, తుక్కు కింద మార్చి విక్రయించే పరిస్థితి తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఇక్కడి పరిశ్రమలను గుజరాత్‌కు తరలిస్తున్నా ఆదిలాబాద్ కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. ఆదిలాబాద్ పంటి వెనుకబడిన ప్రాంతానికి మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, జాతీయ విద్యాసంస్థలు తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. తెలంగాణకు ఒక్క జాతీయ ప్రాజెక్టు కూడా మోదీ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. ప్రతి పేదవాడి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామన్న ప్రధాని మోదీ.. ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. బీజేపీకి ఓటు వేసి 13 ఏళ్లు గడిచినా తెలంగాణకు, ఆదిలాబాద్‌కు ఏం మేలు జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. సింగరేణిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థికంగా దెబ్బతీస్తోందని విమర్శించారు. బొగ్గు కుంభకోణాలతో సంస్థను దివాలా తీసే పరిస్థితికి తీసుకొచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో పారిశ్రామిక వాతావరణానికి సైతం ప్రభుత్వం విఘాతం కలిగిస్తుందని మండిపడ్డారు. బీజేపీ, కాంగ్రెస్ తోడుదొంగలని.. తెలంగాణలో రెండు పార్టీలు పరస్పరం పోరాడుతున్నట్లు నటిస్తాయని, ఢిల్లీలో మాత్రం కలిసి పనిచేస్తాయని కేటీఆర్ ఆరోపించారు. బడేభాయ్, చోటేభాయ్ కలిసి తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. మ్యాప్‌లు చూడండి కేంద్రంలో ఉన్నది డబుల్ ఇంజిన్ సర్కార్ కాదని.. జుమ్లా, హమ్లా అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న కరువు పరిస్థితులపై బీజేపీ నాయకులు రేవంత్‌రెడ్డిని గట్టిగా నిలదీశారా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బూతులు మాట్లాడటం తప్ప మరేమీ చేతకాదని విమర్శించారు.రైతులు అధైర్యపడవద్దని, ఒక్క సంవత్సరం ధైర్యంగా ఉండాలని, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కాబోతున్నారని, రైతులను తిరిగి ఆదుకుంటామని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

అహింసా మార్గంలో పయనించాలి

మొదటి పేజీ తరువాయి

పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులను ఉద్దేశించి ప్రవచనం చేశారు. భగవంతుడు ఎక్కడో లేడని, ప్రతి ఒక్కరి హృద యంలోనే కొలువై ఉంటాడని స్వామీజీ పేర్కొన్నారు. భక్తులు పూలతో పూజించి, నైవేద్యం సమర్పిస్తారని, భక్తితో సమర్పించిన నైవేద్యాన్ని భగవంతుడు సూక్ష్మరూ పంలో స్వీకరిస్తారని వివరించారు. భగవంతుడికి జయం అవసరం లేదని, ఆయనను విశ్వసించే భక్తులకు విజయాన్ని ప్రసాదిస్తారని అన్నారు. దేవుడిని కుటుంబ సభ్యుడిగా భావించి మనస్ఫూర్తిగా ఆరాధించాలని సూచించారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా భగవంతుడిపై విశ్వాసాన్ని కోల్పోకుం డా ధర్మాన్ని పాటిస్తూ ముందుకు సాగాలని భక్తులకు సచ్చిదానంద స్వామి హితవు పలికారు. భగవంతుడి మహిమను వివరిస్తూ బ్రిటి ష్ పాలన కాలంలో తిరుపతిలో జరిగిన ఓ సంఘటనను భక్తులకు సచ్చిదానంద స్వామి స్వామీజీ వివరించారు. అప్పట్లో తిరుమల శ్రీవారికి సమర్పించే నైవేద్యాన్ని అర్చకులే తింటున్నారం టూ ఓ కలెక్టర్ అనుమానం వ్యక్తం చేశారని తెలిపారు. ఈ విషయాన్ని నిరూపించేందు కు ప్రధాన అర్చకుడు ఇతర అర్చకులతో కలిసి కలెక్టర్ సమక్షంలోనే నైవేద్యాన్ని సమర్పించారని చెప్పారు. తెర లేకుండా పూజలు నిర్వహించిన అనంతరం నైవేద్యాన్ని పరిశీలించిన కలెక్టర్‌కు ముందుగా సమర్పించిన ఆహారానికి, తర్వాత తీసుకొచ్చిన నైవేద్యానికి తేడా కనిపించిందని వివరించారు. దీం తో భగవంతుడి మహిమను గుర్తించిన కలెక్టర్ అర్చకులను అభినందించారని స్వామీజీ తెలిపారు. ఈ సంఘటన ద్వారా భగవంతుడి లీలలు అపారమని, ఆయన సర్వాం తర్యామి అని భక్తులకు సచ్చిదానంద స్వామి వివరించారు. ధన్వాడలో కార్యక్రమం ముగిసిన అనంతరం స్వామీజీ రోడ్డు మార్గంలో మంథనికి చేరుకున్నారు. పట్టణంలోని శివకిరణ్ గార్డెన్స్‌లో



వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు దర్శనమిచ్చి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. స్వామివారి రాకతో మంథని ప్రాం తమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వేలాదిమంది భక్తులు భక్తిశ్రద్ధలతో తరలివచ్చి స్వామివారి దివ్య ఆశీస్సులు పొందారు. శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి పాదస్పర్శతో ఈ ప్రాంతం పావనమైందని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మైసూర్‌లో దత్త పీఠం స్థాపించి దత్తాపతారంగా వెలుగొందుతున్న స్వామివారి దివ్య ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలకు లభించడం ఎంతో సంతోషం కలిగిస్తుందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు దర్శనమివ్వాల ని కోరగానే వచ్చిన స్వామివారికి ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు పాదాభివందనాలు తెలియజేశారు. ‘నేను ఒకానొక సందర్భంలో మైసూర్ వెళ్లి స్వామి వారిని దర్శించుకోవడానికి మూడు నాలుగు రోజులు వేచి ఉండేవాడినని దర్శనం దొరికిన తర్వాత నా ఆనందానికి అవధులు లేకుండా ఉండేది’ అని మంత్రి అన్నారు. మా అమ్మగారు మా కుటుంబ సభ్యులము ప్రతి సంవత్సరం స్వామి వారిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకుంటూ జన్మను సార్థకం చేసుకుంటున్నామని తెలిపారు. మంత్రపురి వేద పం డితులకు నిలయమని వేలాది సంవత్సరాలుగా వారు చేస్తున్న పూజలు హోమాల వల్ల ఈ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని మంత్రి వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎండోమెంట్ శాఖ ఈ రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్న విషయాన్ని మంత్రి శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా గుర్తు చేశారు. అన్ని వర్గాల ప్రజలు ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం మంత్రపురి ప్రాంతానికి దర్ప ణం పడుతుందన్నారు. రాష్ట్రంలోని బాసర, ధర్మపురి, వేములవాడ, కాలేశ్వరం, భద్రాచలం ఆలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. రాబోయే గోదావరి నది, ఆ తర్వాత వచ్చే కృష్ణానది పుష్కరాలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ భక్తుల సౌకర్యార్థం వేలాదికోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు దుద్దిళ్ల మారుతి, రామడుగు శ్రీరాములు, రామడుగు అంబదాసు, ఒజ్జల గణేష్, అచలాపురపు శ్రీని వాస్, మారుపాక ప్రశాంత్, ప్రభుత్వ విప్ విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్, రాష్ట్ర రెవె న్యూ అండ్ ఎండోమెంట్ కమిషనర్ శైలజ రామయ్యార్, డైరెక్టర్ హనుమంతరావు, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, సేవ యాదాద్రి ట్రస్టు బోర్డు సభ్యురాలు విజయ రాజం, స్వర్గీయ శ్రీపాదరావు సతీమణి దుద్దిళ్ల జయమ్మ, పీసీసీ ప్రధాన కార్యదర్శి దుదిళ్ల శ్రీను బాబు, మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, రాష్ట్ర విద్యుత్ బోర్డ్ నియంత్రణ మండలి సభ్యులు శశిభూషణ్ కాచే, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రు రమాదేవి సురేష్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి మూల సరోజన పురుషోత్తం రెడ్డి, మాజీ ఎంపీపీ కొండ శంకర్, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

బ్యాగు తెరిస్తే..

రూ.60 లక్షల నకిలీ నోట్లు!

మొదటి పేజీ తరువాయి

వద్ద నుంచి రూ.60 లక్షల ముఖ విలువ కలిగిన నకిలీ భారతీయ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. రాజస్థాన్‌లోని బికనీర్ జిల్లాకు చెందిన యువకుడికి అదే ప్రాంతానికి చెందిన ఓం ప్రకాశ్ పరిచయమయ్యాడు. నకిలీ నోట్లను ముంబైకి చేరవేస్తే రూ.20 వేలు ఇస్తానని ఆశ చూపించాడు.అక్టోబర్ 28నజైపూర్ రైల్వే స్టేషన్‌లోనకిలీనోట్లతోకూడినబ్యాగును అతడికి అందజేసినట్లు పోలీసులు గుర్తించారు.ముందుగా కాచిగూడకు వెళ్లి, అక్కడి నుంచి ముంబైకి బయలుదేరాలని సూచించాడు. దీంతో యువకుడు హైదరాబాద్ చేరుకుని కాచిగూడలోని ఓ లాడ్జిలో బస చేశాడు. మరుసటి రోజు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకుని ముంబై ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు సిద్ధమయ్యాడు. అయితే అతడి ప్రయాణ ప్రణాళికకు పోలీసుల తనిఖీలు అడ్డుకట్ట వేశాయి. అనుమానంతో తనిఖీలు చేపట్టిన GRP, RPF సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకున్నారు. మ్యాప్‌లు చూడండి బ్యాగును తెరిచి చూడగా రూ.60 లక్షల విలువైన నకిలీ నోట్లు బయటపడ్డాయి. విచారణలో ముంబైలోని ఓ వ్యక్తికి ఈ నోట్లను అందజేయాల్సి ఉందని యువకుడు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో కీలకంగా భావిస్తున్న ఓం ప్రకాశ్ పరారీలో ఉన్నట్లు సమాచారం. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. రూ.20 వేల ఆశతో రూ.60 లక్షల నకిలీ కరెన్సీని తరలించేందుకు ప్రయత్నించిన ఈ ఘటన వెనుక ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది? ఈ నకిలీ నోట్ల నెట్‌వర్క్ ఎక్కడి నుంచి పనిచేస్తోంది? ముంబైలో వాటిని స్వీకరించాల్సిన వ్యక్తి ఎవరు? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘట్ కేసర్ రైల్వే బ్రిడ్జి నిర్మాణంపై నిర్లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

వ్యాపార, వాణిజ్య సముదాయాలు, విద్యా సంస్థలు, రవాణా రంగాలు ఈ బండ్ల సహకరించి విజయవంతం చేయాలని అఖిలపక్ష నేతలు కోరా రు. పనులు వేగవంతం చేసి బ్రిడ్జిని అందుబాటులోకి తెచ్చే వరకు తమ పోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు. ఏళ్లు గడుస్తున్నా పూర్తవని ఈ రైల్వే బ్రిడ్జి పనులపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి కాంట్రాక్టర్ తో యుద్ధప్రా తిపదికన పనులు పూర్తి చేయించాలని ఘట్ కేసర్ పట్టణ వాసులు గట్టిగా నిరసన గళం విప్పుతున్నారు.

రేషన్ బియ్యం మాఫియా గుట్టురట్టు!

పాలిష్ చేసి బ్రాండెడ్ పేర్లతో అక్రమ విక్రయాలు

కర్మన్‌ఘాట్‌లో సివిల్ సప్లైస్, విజిలెన్స్ అధికారుల దాడులు

దశ, హైదరాబాద్: పేదలకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా సేకరించి, రీసైక్లింగ్ చేసి బ్రాండెడ్ పేర్లతో విక్రయిస్తున్న మాఫియా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన సివిల్ సప్లైస్, విజిలెన్స్ అధికారులు కర్మన్‌ఘాట్ పరిసరాల్లోని రైస్ డిపోలు, గోదాములపై ఏకకాలంలోదాడులునిర్వహించారు.ఈతనిఖీల్లోభారీగానిల్వ ఉంచినరేషన్‌బియ్యం, ప్రాసెసింగ్ యంత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. రేషన్ లబ్ధిదారులు, డీలర్ల నుంచి తక్కువ ధరకు బియ్యం సేకరిస్తున్న దళారులు వాటిని మిల్లుల్లో ప్రత్యేక యంత్రాలతో పాలిష్ చేసి సన్నబియ్యంలా మారుస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అనంతరం ప్రముఖ బ్రాండ్ల పేర్లతో ఉన్న సంచుల్లో ప్యాక్ చేసి మార్కెట్లో కిలో రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. రేషన్ బియ్యాన్ని పదేపదే పాలిష్ చేయడం వల్ల పోషక విలువలు తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ అక్రమాలకు సహకరిస్తున్న డీలర్లు, మిల్లుల యజమానులు, దళారులపై కఠిన చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు బయోమెట్రిక్ ట్రాకింగ్, జీపీఎస్ వంటి పర్యవేక్షణ చర్యలను మరింత పటిష్ఠం చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ వెల్లడించింది.



నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: సీఎం రేవంత్

HMWSSB 37వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు.. ‘గ్రీన్ ట్యాంకర్’ కార్యక్రమానికి ప్రశంసలు.

దశ, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (HMWSSB) 37వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి బోర్డు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గత 37 ఏళ్లుగా హైదరాబాద్ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడంతో పాటు, మురుగునీటి నిర్వహణలో బోర్డు కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. నగర అభివృద్ధి, ప్రజారోగ్యం, సమగ్ర ప్రగతికి బోర్డు అందిస్తున్న సేవలను అభినందించారు. విస్తరిస్తున్న హైదరాబాద్ నగరంలో నీటి భద్రతకు, జలవనరుల సుస్థిర నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించారు. ఎల్‌నినో ప్రభావం, మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మంచినీటి వనరులను పరిరక్షించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. గృహావసరాలకు సంబంధం లేని పనులకు మంచినీటి వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రారంభించిన ‘డయల్ గ్రీన్ ట్యాంకర్ - గ్రీన్ ట్యాంకర్ ఆపరేషన్స్’ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. సుస్థిర నీటి నిర్వహణ దిశగా ఇది సరైన సమయంలో చేపట్టిన కీలక కార్యక్రమమని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు, పరిశ్రమలు, నిర్మాణ సంస్థలు, వాణిజ్య సంస్థలు తోటల పెంపకం, నిర్మాణ పనులు, పారిశ్రామిక అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటిని (Treated Wastewater) విస్తృతంగా వినియోగించాలని పిలుపునిచ్చారు. దీంతో మంచినీటిపై ఆధారపడటం తగ్గి, గృహావసరాలకు తాగునీరు మరింత అందుబాటులో ఉంటుందని తెలిపారు.నీటి సంరక్షణను ప్రతి ఒక్కరూ సమిష్టి బాధ్యతగా స్వీకరించాలని, నీటి భద్రత కలిగిన హైదరాబాద్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కోర్ అర్బన్ రీజియన్ (CURE) పరిధిలోని ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ HMWSSB మరిన్ని విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com